ప్రజాశక్తి

శనివారం 4 ఫిబ్రవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





ముడసర్లోవ ప్రైవేటుపరంపై..

ఆగ్రహ జ్వాల

- సిపిఎం, టిడిపి ఆధ్వర్యాన వేర్వేరుగా ధర్నాలు
- బినామీలకు కట్టబెట్టేందుకు కుట్ర
- వైసిపి తీరును ఎండగట్టండి : సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు పిలుపు

ప్రజాశక్తి - ఆరిలోవ

ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం (పిపిపి) పేరుతో ముడసర్లోవ పార్కు రిజర్వాయర్‌కు చెందిన 282 ఎకరాల భూమిని కాజేసేందుకు అధికార పార్టీ కుట్ర పన్నిందని పేర్కొంటూ సిపిఎం, టిడిపి ఆధ్వర్యాన శుక్రవారం ముడసర్లోవ పార్కు వద్ద వేర్వేరుగా ధర్నాలు జరిగాయి. 'ప్రజల సంపదైన ముడసర్లోవను ప్రయివేటుపరం కానివ్వం' అంటూ ఆందోళనకారులు పెద్దపెట్టున నినదించారు.



నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు



ముడసర్లోవ పార్కు వద్ద ధర్నా చేపట్టిన సిపిఎం నాయకులు, కార్యకర్తలు

సిపిఎం ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాను ఉద్దేశించి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడారు. 282 ఎకరాల భూమిని కాజేసేందుకు చూస్తున్న వైసిపి కీలక నేత వైఖరిని ఎండగట్టాలని, ప్రజల ఆస్తులను కాపాడుకోవడానికి అందరూ ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జివిఎంసి ఎన్నికల్లో ప్రజల ఆస్తులను కాపాడుతామని, ప్రజలపై భారాలు మోపబోమని వాగ్ధానాలు చేసి కార్పొరేషన్ పీఠాన్ని చేజిక్కించుకున్న వైసిపి నేడు ప్రజా సంపదను తమ పార్టీ వారికి అప్పనంగా కట్టబెడుతోందన్నారు. ప్రజలపై భారాలు మోపడమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. విశాఖ నగర నడిబొడ్డున ఉన్న విలువైన ప్రభుత్వ భూములను అధికారాన్ని అడ్డుపెట్టుకొని మిగతా 2లో..



మాట్లాడుతున్న మంత్రి వెంకట నాగేశ్వరరావు

కనీస మద్దతు ధర ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి వెంకట నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధరను కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని, ధాన్యం సేకరణ కూడా పకడ్బందీగా చేపడుతోందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉదయం జివిఎంసి సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు క్షేమం కోసం పండించిన పంటకు మంచి ధర కల్పించడంతో పాటు దళారీ వ్యవస్థ లేకుండా చేశామన్నారు. రైతులు ఆన్‌లైన్ విధానం ద్వారా నగదు కోరుకుంటున్నారని, గతంలో రూ.1200 ఉన్న మద్దతు ధర ప్రస్తుతం రూ.1530గా ఉందని తెలిపారు. అది నేరుగా రైతుల ఖాతాలో జమవుతోందన్నారు. ప్రస్తుత సంవత్సరంలో సకాలంలో వర్షాలు పడడంతో పాటు తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలు లేనందువల్ల ప్రత్యేకించి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో నాణ్యతతో కూడిన అధిక పంట దిగుబడి వచ్చిందన్నారు. రాగులు, జొన్నలను కూడా రాష్ట్రంలో ప్రజలు కోరుకుంటున్నారని, అందుకోసం రైతులను ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రైతులు మిగతా 2లో..

ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటాం

వార్త 2లో..

వాల్తేరుకు రూ.2857.85 కోట్లు కేటాయింపు

వార్త 2లో..

6 నుంచి విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్

వార్త 2లో..



విశాఖ జిల్లా విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ప్రజా ప్రతినిధులు

జగనన్న విదేశీ విద్యా దీవెన ప్రారంభం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో విద్యార్థులకు ఆర్థిక సాయం వార్త 6లో..

గడువులోగా భూ సేకరణ

- త్వరితగతిన అభ్యంతరాల పరిష్కారానికి కృషి
- 20 గ్రామాల్లో పూర్తయిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్
- 'ప్రజాశక్తి'తో సుజల స్రవంతి ప్రాజెక్టు భూ సేకరణ విభాగం ఎస్‌డిసి రమామణి



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు భూ సేకరణ గడువులోగా పూర్తిచేస్తాం. జిల్లాలోని అనకాపల్లి, కశింకోట, సబ్బవరం మండలాల్లో 22 గ్రామాల నుంచి 1800 ఎకరాల భూమి సేకరించాల్సివుంది. అందులో 21 గ్రామాల నుంచి 1205 ఎకరాలను రైతుల నుంచి సేకరించనున్నాం. మరొక గ్రామంలో పూర్తిగా, ఇతర గ్రామాల్లో 600 ఎకరాలు ప్రభుత్వానికి సంబంధించిన భూమి వుంది. సేకరించాల్సిన 21 గ్రామాలకుగానూ 20 గ్రామాల్లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ (డిఎన్) పబ్లిష్ అయింది. రెండు గ్రామాల్లో డ్రాఫ్ట్ డిక్లరేష్ (డిడి) పబ్లిష్ అయింది. రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీలైనంత త్వరగా పరిష్కరించి డిడి పబ్లిష్ చేయనున్నాం' అని సుజల స్రవంతి ప్రాజెక్టు స్రవంతి ప్రాజెక్టు భూ సేకరణ విభాగం ఎస్‌డిసి కె.రమామణి తెలిపారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆమె



'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో గడువులోగా భూ సేకరణ పూర్తిచేసేందుకు చేస్తున్న కృషిని వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

సుజల స్రవంతికి ఏ మండలాల నుంచి భూమి సేకరించాలి ?

అనకాపల్లి మండలంలో 10, కశింకోటలో మూడు, సబ్బవరంలో తొమ్మిది గ్రామాల నుంచి భూ సేకరణ చేయాల్సివుంది. సబ్బవరంలో ప్రభుత్వ భూమి వున్న గ్రామం మినహా మిగిలిన 21 గ్రామాల నుంచి 1205 ఎకరాలు సేకరించనున్నాం.

ఇప్పటి వరకూ ఎంతభూమి సేకరించారు ?

22 గ్రామాల్లో ఒక గ్రామం మినహా సేకరించాల్సిన మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

'ముడసర్లోవ' ప్రైవేటుపరంపై ఆగ్రహజ్వాల

కాజేందుకు వైసిపి నేతలు చూస్తున్నారన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజల ఆస్తులను కాజేయడం తగదన్నారు. ముడసర్లోవ పార్కు చుట్టూ వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అదే విధంగా ఎంతో మంది దాహార్తిని తీర్చే రిజర్వాయర్ ఉందని తెలిపారు. వీటిని మింగేయడానికి పాలక వర్గం చూస్తోందన్నారు. ఎంపీ విజయసాయి రెడ్డి అనుయాయులకు ఇక్కడి ప్రాంతాన్ని కట్టబెట్టాలని చూస్తోందన్నారు. ముడసర్లోవ పార్కును జివిఎంసి అధీనంలోనే నడపాలని, ఒక్క అంగుళం కూడా పిపిపి కింద ప్రయివేటుకు అప్పగించరాదని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ పిపిపి పద్ధతి అంటేనే బినామీలకు అప్పగించడమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి వి.నరేంద్రకుమార్, నాయకులు రంగమ్మ, సూర్యమణి, పి.శంకరరావు, నాగరాజు, కాంతం, రమణమ్మ, గౌరి, రమణ పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన..

టిడిపి ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పల్లా శ్రీనివాస్, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ మాట్లాడారు. ఇదే తరహాలో పాలన సాగిస్తే రానున్న రోజుల్లో ప్రజావసరాలకు ఒక్క సెంటు భూమి కూడా మిగలదన్నారు. ముడసర్లోవ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములను ప్రయివేటుకు అప్పగిస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో జివిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్, నాయకులు కోరాడ రాజబాబు, ఒమ్మి సన్యాసిరావు, బుడుమూరు గోవిందు, ఒమ్మి అప్పలరాజు, ఒమ్మి పోలారావు, గాడి సత్యం, మూది అప్పారావు, ముగడ రాజారావు, పోతన్న రెడ్డి, ఏడువాక సన్యాసిరావు, గోపాల్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను విరమించుకోండి : ఇఎఎస్ శర్మ

ఎంవిపి.కాలనీ : ముడసర్లోవ పార్కు, రిజర్వాయర్ ప్రాంతాన్ని ప్రయివేటుకు అప్పగించడం దారుణమని, ఆ చర్యను విరమించుకోవాలని విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ అన్నారు. ఈ మేరకు ఎపి రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డికి ఆయన లేఖ రాశారు.

గడువులోగా భూ సేకరణ

21 గ్రామాలకుగానూ 20 గ్రామాల్లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ (డిఎన్) పబ్లిష్ అయింది. అనకాపల్లి మండలంలోని కొండుపాలెంలో 22 ఎకరాలు, సబ్బవరం మండలంలోని నల్లరేగుడుపాలెంలో 36 ఎకరాలకు డ్రాఫ్ట్ డిక్లరేషన్ (డిడి) పబ్లిష్ అయింది.

డిఎన్‌పై వచ్చిన అభ్యంతరాలెన్ని?

డిఎన్ పబ్లిష్ అయిన గ్రామాల రైతుల నుంచి 247 అభ్యంతరాలొచ్చాయి. వీటిలో 23 అభ్యంతరాలను పరిష్కరించి, కొండుపాలెం, నల్లరేగుడుపాలెంలో డిడి పబ్లిష్ చేశాం. మిగిలిన అభ్యంతరాలను వేగంగా పరిష్కరించి డిడి పబ్లిష్ చేయనున్నాం. వచ్చిన అభ్యంతరాల్లో నోటిఫికేషన్‌లో భూమి తక్కువనో, ఎక్కువనో, వేరే భూమి పడిపోయిందనో వున్నాయి.

అభ్యంతరాలను తొందరగా పరిష్కరించడానికి సరిపడా సిబ్బంది వున్నారా ?

మా కార్యాలయంలో వివిధ కేడర్లకు సంబంధించి 21 మంది సిబ్బంది అవసరం. వీరిలో ప్రధానంగా ఇద్దరు డిప్యూటీ తహశీల్దార్లు, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్‌లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు సర్వేయర్లు, ఇతర సిబ్బంది అవసరముంది. ప్రస్తుతం ఒక డిప్యూటీ తహశీల్దార్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. సిబ్బంది సరిపడా వుంటే రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీలైనంత తొందరగా పరిష్కరిస్తాం.

భూ సేకరణ ఎప్పటిలోగా పూర్తిచేస్తారు ?

ప్రభుత్వం నిర్దేశించిన గడువు ప్రకారం 2024 మే నాటికి భూ సేకరణ ప్రక్రియ పూర్తిచేస్తాం. అభ్యంతరాలు పరిష్కరించిన తరువాత డిడిలు పబ్లిష్ చేస్తాం. డిడిలు పబ్లిష్ అయిన రెండు గ్రామాల రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై ప్రతిపాదనలను ఇరిగేషన్ శాఖకు పంపించనున్నాం. నిధులు సమస్య లేదు. ప్రతిపాదిత పరిహారం ప్రకారం నిధులు డిపాజిట్ చేస్తాం.

పరిహారం ఏ ప్రాతిపదికన చెల్లించనున్నారు ?

సబ్ రిజిస్ట్రార్ ఇచ్చిన మార్కెట్, బేసిక్ విలువ ఆధారంగా 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు పరిహారం చెల్లించనున్నాం. భూముల విలువ ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాశాం.

కనీస మద్దతు ధర ప్రభుత్వ లక్ష్యం

పండించిన రాగులు, జొన్నలను కూడా రైతుల నుంచి పౌర సరఫరాల శాఖ కొనుగోలు చేసి పంపిణీకి చర్యలు చేపడుతుందన్నారు. 16 మున్సిపాలిటీలలో పైలెట్ ప్రాజెక్టుగా గోదుమ పిండి పంపిణీ చేయడాన్ని ప్రారంభించామన్నారు. వినియోగదారులు నష్టపోకూడదనే ఆలోచనతో పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్, గోల్డు షాపులతో పాటు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి 555 కేసులను చేశామన్నారు. అంతకు ముందు ఉత్తరాంధ్రకు సంబంధించి జాయింట్ కలెక్టర్లు, డిఎస్‌ఒలు, డిఎంలు, లీగల్ మెట్రాలజీ, ఎఫ్‌సిఐ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉన్నతాధికారులు అరుణ్ కుమార్, విజయ సునీత పాల్గొన్నారు.

తోపుడు బండ్లు, చిరు వ్యాపారులను తొలగించవద్దు

జివిఎంసి వద్ద సిఐటియు, ఎఐటియుసి ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, తోపడుబండ్లు, చిల్లర వర్తకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జి - 20 సమ్మిట్ మార్చిలో విశాఖలో జరుగుతున్న నేపథ్యంలో తోపుడు బండ్లు, చిరు వ్యాపారస్తులను రోడ్ల పై నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యాన తోపుడుబండ్ల కార్మికులు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రేటర్ విశాఖ వీధి విక్రయదారులు, చిరు వ్యాపారస్తుల కార్మిక సంఘాల నాయకులు పి.వెంకటరెడ్డి, ఎం.సుబ్బారావు, ఎ.సింహాచలం, టి.వెంకటేశ్వరరావు మాట్లాడారు. విశాఖ జిల్లాలో మార్చిలో జరగబోయే జి-20 గ్లోబల్ సమ్మిట్‌కు వివిధ దేశాల నుంచి పెట్టుబడిదారులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు నగరానికి వస్తున్నారనే నెపంతో నగర పరిధిలోని తోపుడు బండ్లు, చిరు వ్యాపారస్తులను జివిఎంసి అధికారులు, పోలీసులు అన్యాయంగా తొలగించడాన్ని తక్షణమే నిలిపేయాలన్నారు. ఎక్కడ వారికి అక్కడే ఉపాధి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పొట్టచేతపట్టుకొని విశాఖ నగరానికి వలస వచ్చిన అత్యధిక మంది స్వయం ఉపాధితో బతుకుతున్నారన్నారు. తోపుడు బండ్లతో వీధుల్లోనూ, సంతల్లోనూ, చిన్న బడ్డీ దుకాణాలపై చిరు వ్యాపారాలు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నా రన్నారు. వీధి విక్రయ దారులకు, చిరు వ్యాపారస్తులకు ఉపాధి రక్షణ కల్పించాలని కేంద్రం చట్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వారికి హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కానీ విశాఖ నగరంలో పోలీసులు, జివిఎంసి అధికారులు దౌర్జన్యంగా చిరు వ్యాపారస్తులపై దాడులకు పూనుకుంటున్నారన్నారు. ఇది దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. జి-20 సమావేశాల పేరుతో 10 వేల మంది తోపుడు బండ్లు, చిరు వ్యాపారస్తుల కుటుంబాలు రోడ్డునపడే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. జివిఎంసి కమిషనర్ తక్షణమే జోక్యం చేసుకొని తొలగించిన బడ్డీలను, తోపుడుబండ్లును పెట్టించాలని, మిగిలిన వారికి వ్యాపారాలు చేసుకునే విధంగా ఉపాధి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాము ఎక్కడికక్కడ నిరసనలకు దిగుతామని, సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం గాంధీ విగ్రహం నుంచి జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బుజ్జి గణపతి, సిహెచ్.పద్మరాజు, జి.వామనమూర్తి, బి.రాము, జె.నరసింహమూర్తి పాల్గొన్నారు.

6 నుంచి ఫిల్మ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 8 వరకు విశాఖ నగరంలో ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలి తెలుగు టాకీ సినిమా భక్త ప్రహ్లాద విడుదలై 91 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు టాకీ సినిమా ఆవిర్భావ ఉత్సవాలలో భాగంగా ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రతిరోజూ సాయంత్రం 5:45 నిమిషాల నుంచి పలు చిత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ నెల 6న కీర్తిశేషులు జమున నటించిన ఉండమ్మా బొట్టు పెడతా, 7న మాలపిల్ల, 8న విరాటపర్వం సినిమాలను ఫెస్టివల్ సందర్భంగా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఫెస్టివల్‌కు ప్రవేశం ఉచితమని చెప్పారు. గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.

ఆర్ఐఎన్ఎల్ ఉద్యోగుల వేతన ఒప్పందం చేయండి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఆర్ఐఎన్ఎల్ ఉద్యోగుల వేతన సవరణ ఒప్పందం అమలు చేయాలని కోరుతూ రాజ్యసభ సభ్యులు, వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి కేంద్ర స్టీల్, పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు శుక్రవారం లేఖ రాశారు. దీనిపై స్పందించిన మంత్రి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ మార్గదర్శకాలు, కంపెనీ స్థోమత, ఆర్థిక స్థిరత్వం దృష్ట్యా ఆర్ఐఎన్ఎల్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల వేతన సవరణ సాధ్యం కాలేదని వెల్లడించారు. అలాగే ఎఫ్ఎస్ఎన్ఎల్ ఉద్యోగుల వేతన సవరణ అంశం ప్రస్తుతం స్టీల్ మంత్రిత్వ శాఖ పరిశీలనలో ఉందని తెలిపారు.

వాల్తేరు డివిజన్‌కు రూ.2857.85 కోట్లు కేటాయింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ గ్రాంట్‌పై ఢిల్లీ నుంచి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతరం విశాఖపట్నంలోని డిఆర్ఎం సమావేశ మందిరంలో డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పలు విషయాలను వెల్లడించారు. వాల్తేరు డివిజన్‌కు వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.2800 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు.

ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌తో సహా ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నింటినీ కాపాడుకుంటామని విశాఖ జిల్లా ట్రాన్స్‌పోర్టు మోటార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 673వ రోజుకు చేరాయి. దీక్షల్లో క్యాబ్ వర్కర్స్ యూనియన్, విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఉన్నందునే విశాఖపట్నం మహా నగరంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. దీక్షల్లో క్యాబ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పి.శ్రీరాములు, సహాయ కార్యదర్శి కె.నారాయణ, ఎడ్మిన్ పి.గోపికృష్ణ, ఎం.నాగేశ్వరరావు, కె.అప్పలరాజు, ఆనంద రావు, శ్రీను, మురళి, విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం కార్యదర్శి పి.రాజ్ కుమార్, సంతోష్, శామ్ సన్, రమణబాబు, కనకరాజు, లక్ష్మణరావు, సతీష్ పాల్గొన్నారు.

రైతుబజారులో పార్కింగ్ ఫీజు!

వ్యాపారులు, కొనుగోలుదారుల ఆగ్రహం - నిర్వీర్యానికి కుట్ర అంటూ మండిపాటు



గాజువాక మహిళా రైతుబజారు, పార్కింగ్ ఫీజుల పట్టిక



ప్రజాశక్తి -గాజువాక : గాజువాక మహిళా రైతు బజార్‌లో పార్కింగ్ ఫీజు వసూలు చేయడంపై కొనుగోలుదారులతోపాటు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సైకిల్‌కు రూ.రెండు, బైక్‌కు రూ.ఐదు, ఆటోకు రూ.10, కారుకు రూ.20 చొప్పున గత పదిరోజులుగా పార్కింగ్‌ఫీజును వసూలు చేస్తున్నారు. ఇప్పటికే ప్రజలపై ఇంటిపన్ను, ఇతరత్రా పన్నులతోపాటు తాజాగా చెత్తపై కూడా పన్నువేసి ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వం, యంత్రాంగం, రైతుబజారులోనూ పార్కింగ్‌కు ఫీజు వసూలు చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి కూరగాయలు తెస్తున్న ఆటోలకు కూడా రూ.పది చొప్పున వసూలు చేయడం, కూరగాయలు కొనేందుకు వచ్చేవారి వాహనాలకు ఫీజు వసూలు చేయడం సరికాదని అంటున్నారు. బయట మార్కెట్ కంటే రూ.ఐదో, రూ.పదో తగ్గుతుందని రైతుబజారుకు వచ్చిన

స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ వితరణ

విశ్రాంత జ్యూట్ కార్మికునికి నగదు, నిత్యావసరాలు



విశ్రాంత జ్యూట్ కార్మికునికి సాయం చేస్తున్న శ్రీరామ్

ప్రజాశక్తి - భీమునిపట్నం : విశ్రాంత చిట్టివలస జ్యూట్ కార్మికుడు వి అప్పారావుకు స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కె శ్రీరామచంద్ర మూర్తి నెలకు సరిపడా నిత్యావసరాలు, రూ.3 వేలు నగదును శుక్రవారం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో కాలువిరిగి ఇంటి వద్దనే ఉంటూ, ఎటువంటి జీవనాధారం లేకుండా జ్యూట్ కార్మిక వాడలో ఉంటున్న అప్పారావుకు ఈ మేరకు సాయం చేశారు. కార్యక్రమంలో స్థానికులు రాము, శ్రీను, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మను దర్శించుకున్న జెడ్‌సి

ప్రజాశక్తి -పిఎం పాలెం: మాఘమాసం రెండవ శుక్రవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడిన మధురవాడ, చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారిని రెండో జోన్ కమిషనర్ కనకమహాలక్ష్మి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్‌సిగా బాధ్యతలు చేపట్టిన మొదటిసారిగా ఆలయానికి వచ్చిన జెడ్‌సి కనకమహాలక్ష్మికి ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, సెక్రటరీ నాగోతి తాతారావు, ఉపాధ్యక్షులు పివిజి.అప్పారావు, సభ్యులు కేశనకుర్తి అప్పారావు, ఎస్ఆర్.బాబు, దుర్గాశి సోంబాబు, పొట్నూరు హరికృష్ణ, మరుపిల్లి ఆనంద్, పిళ్లా రమణ, పిళ్లా మోహన్ శివకృష్ణ, నాగోతి అప్పలరాజు, గ్రామ పెద్దలు బావిశెట్టి సత్యనారాయణ, పిళ్లా వెంకటరమణ, పిళ్లా అప్పన్న, పి.రాంబాబు, జగ్గారావు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

ప్రజాశక్తి- పెందుర్తి :ప్రభుత్వ భూముల్లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలు తొలగించాలని టిడిపి నాయకులు దాట్ల మధు శుక్రవారం తహశీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సుజాతనగర్ దరి రత్నగిరి నగర్ కాలనీ ఆనుకొని సర్వే నెంబర్ 144లో ప్రభుత్వ భూముల ఆక్రమించి భారీ రేకుల షెడ్ నిర్మించారని, సుజాతనగర్ 80 అడుగుల రోడ్‌లో ఇటీవల నిర్మించిన సినిమా థియేటర్ ఎదురుగా సర్వే నెంబరు ఒకటిలో స్థలాన్ని ఆక్రమించుకొని వాహనాలు పార్కింగ్ చేస్తున్నార్నారు. ఆక్రమణల నుంచి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరారు.

గీతంలో అట్టహాసంగా 'షోర్ ఫెస్ట్ -23'

ప్రజాశక్తి -మధురవాడ : యువతలో ప్రతిభను వెలికి తీయడానికి, వివిధ ప్రాంతాల సంస్కృతి సంప్రదాయాలను, కళారూపాలను తెలుసుకోవడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహిస్తున్న 'షోర్ ఫెస్ట్-23' శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. గీతం విసి ప్రొఫెసర్ దయానంద సిద్దవటం ప్రారంభించిన వేడుకలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి దాదాపు 4 వేల మంది విద్యార్థులు విభిన్న సంప్రదాయ దుస్తుల్లో పెద్దఎత్తున పాల్గొని సందడి చేశారు. విద్యార్థులు కేరింతల మధ్య గీతం ప్రాంగణం పండగ వాతావరణాన్ని సంతరించుకుంది. గీతంలోని వివిధ వేదికలపై సాంస్కృతిక, క్రీడా పోటీలను నిర్వహించారు. ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ఏ విధంగా చేరాలనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. సాంకేతిక అంశాలపై నిపుణుల చర్చాగోష్టిలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో. ప్రో వైస్‌ఛాన్స్‌లర్స్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, స్టూడెంట్ లైఫ్ డిప్యూటీ డైరక్టర్ రాహుల్‌సింగ్, స్పోర్ట్స్ డైరక్టర్ అరుణా కార్తిక్ పాల్గొన్నారు.



షోర్‌ఫెస్ట్‌లో సాంస్కృతిక ప్రదర్శన

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై సమీక్ష

ప్రజాశక్తి- సీతమ్మధార : త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో శుక్రవారం సమన్వయకర్త కెకె.రాజు సమీక్షించారు. ముఖ్య అతిథిగా వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పార్టీ ఎంపికచేసిన అభ్యర్థి సీతంరాజు విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, కె.కామేశ్వరి, వి.ప్రసాద్, చల్లా రజిని, కె.వి.యన్ శశికళ, డైరెక్టర్లు, సచివాలయం కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగవరంలో పూరి గుడిసె దగ్ధం

ప్రజాశక్తి-గాజువాక : గంగవరం గ్రామంలో శుక్రవారం పూరి గుడిసె దగ్ధమైంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో పూరిగుడిసె మొత్తం అగ్నికి ఆహుతైంది. ఇంట్లోని విలువైన సామాన్లన్నీ బూడిదయ్యాయి. ఇంట్లో ఎవరూలేని సమయంలో ప్రమాదం జరగడంతో ప్రాణాపాయం తప్పింది. అగ్నిమాపకసిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను అదుపు చేశారు.

4, 5 తేదీల్లో 'రాపర్తి' శత జయంతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కృష్ణా కాలనీ, యోగా చైతన్య సంస్థ ప్రాంగణంలో యోగాచార్య డాక్టర్ రాపర్తి రామారావు జ్ఞాపకార్థం ఈ నెల 4,5 తేదీల్లో శత జయంత్యుత్సవాలను నిర్వహించనున్నట్లు చైతన్య సంస్థ కార్యదర్శి గనివాడ అప్పల నాయుడు, ఉపాధ్యక్షులు సిహెచ్ వెంకటరమణ తెలిపారు. యోగా కన్సియస్‌నెస్ ట్రస్ట్ అధ్వర్యంలో ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు విజినిగిరి ట్రస్ట్ అధ్యక్షులు టివిఎల్ నరసింహారావు అధ్యక్షతన హైదరాబాద్‌కు చెందిన ఐఎఎస్ డాక్టర్ డి శ్రీనివాసులు, న్యూఢిల్లీకి చెందిన మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా, మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్ డైరెక్టర్ డాక్టర్ ఈశ్వర్ వి బసవరెడ్డి, బెంగళూర్ ఎస్‌వివైఎఎస్ఎ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌కె. మంజునాథశర్మ, ముంబై ఇండియన్ యోగా ఇనిస్టిట్యూట్ అకడమిక్స్ అండ్ అక్రెడిటేషన్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ గణేష్‌రావు తదితరులు పాల్గొంటారని, ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు

నిత్యానంద త్రయోదశి

ప్రజాశక్తి -మధురవాడ: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో శుక్రవారం నిత్యానంద ప్రభువు ఆవిర్భావ దినోత్సవం. నిత్యానంద త్రయోదశిని సాంబదాస్, నితాయిసేవిని మాతాజీ సారథ్యంలో వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా నితాయ్ గౌరంగ ప్రభువులకు పంచామృతాభిషేకాలు ప్రత్యేక హారతి, భక్తిగీతాలాపనతోపాటు శయన హారతి, శయన పల్లకి సేవలను నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని జివిఎంసి నాలుగోవార్డు తిమ్మాపురం హేచరీస్, విజ్ఞాన్ స్కూల్, గ్రేహౌండ్స్, పారిశ్రామికవాడ ప్రాంతాల్లో ఈ నెల 4న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎ ఇ శేఖరయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, నియోగదారులు సహకరించాలని కోరారు.

వినియోగదారుల పట్ల మర్యాద అవసరం

ప్రజాశక్తి- సీతమ్మధార: రైతుబజారుకు వచ్చే వినియోగదారుల పట్ల రైతులు మర్యాదపూర్వకంగా మెలగాలని మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్ సూచించారు. శుక్రవారం సీతమ్మధార రైతుబజారును సందర్శించి, రైతులకు తగు సూచనలు చేశారు. చిల్లర సమస్య లేకుండా చూడాలని, కేటాయించిన స్టాల్స్‌లోనే వ్యాపారాలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, అసిస్టెంట్ సతీష్ పాల్గొన్నారు

ప్రాపర్టీ రైట్స్‌పై సెమినార్

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని గుడిలోవ ఎక్యూజె పిజి కళాశాలలో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌పై ఎం.పరమేష్ దేవెల్లా అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. విద్యార్థులకు పేటెంట్స్, ట్రేడ్ మార్కుల ప్రాముఖ్యత వివరించి, వాటిని ఎలా రిజిస్టర్ చేయించుకోవాలో వివరించారు. యువతలో సజనాత్మకత, పరిశోధనా గుణం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వారి ఆవిష్కరణలను ఏవిధంగా, ఎంత కాలానికి రిజిస్టర్‌చేయించుకోవాలో వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి సుధారాణి పాల్గొన్నారు

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను శుక్రవారం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, విశాఖపట్నం నియోజకవర్గ టిడిపి ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్, 98వ కార్పొరేటర్ పీవీ నరసింహం దర్శించుకున్నారు. ఇదే రోజున ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ బుద్ధ చంద్రశేఖర్ అప్పన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల ఆశీర్వాదం తర్వాత అధికారుల నుంచి తీర్థప్రసాదాలను అందుకున్నారు.

ప్రారంభ దశలో గుర్తిస్తే కేన్సర్‌ను జయించొచ్చు



కేన్సర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మేయర్

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆరిలోవ హెల్త్‌సిటీ హెచ్‌సిజి కేన్సర్ ఆసుపత్రిలో నిర్వహించిన బాల్డ్ అండ్ బోల్డ్ కార్యక్రమం అందరినీ ఆలోజింప చేసింది. వింగ్స్ ఫర్ లైఫ్ స్వచ్ఛందసంస్థ, నేచురల్ సెలూన్ భాగస్వామ్యం తో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రారంభించిన నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరమని, ముఖ్యంగా మహిళల్లో ఎక్కువగా వచ్చే రొమ్ము, గర్భాశయ కేన్సర్‌పై అవగాహనతో ఎప్పటికప్పుడు స్క్రీనింగ్ చేయించుకుని తగు జాగ్రత్తలు తీసుకుంటే ఈ మహమ్మారి నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కేన్సర్ చికిత్సతో జుట్టు కోల్పోయిన రోగులకు విగ్గులను అందిస్తామని ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆదిత్య కౌర్ తెలిపారు. అత్యధికులు తల వెంట్రుకలను దానం చేయడం అభినందనీయమన్నారు.

పలుచోట్ల కేన్సర్ అవగాహన దినోత్సవం

ప్రారంభ దశలో గుర్తిస్తే కేన్సర్‌ను జయించొచ్చు

ఆరిలోవ :ప్రారంభ దశలోనే గుర్తిస్తే కేన్సర్‌ను సులువుగా నయం చేయొచ్చని అపోలో ఆసుపత్రి ఆంకాలజిస్టులు డాక్టర్ సుమన్ దాస్, డాక్టర్ రమేష్ అల్లూరి, డాక్టర్ రాకేష్‌రెడ్డి బోయ, డాక్టర్ చంద్రకళ్యాణ్, డాక్టర్ ఆదిత్య నారాయణ్, డాక్టర్ జయశ్రీ వెల్లడించారు. శుక్రవారం ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరిలోవ హెల్త్‌సిటీ అపోలో ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన సదస్సులో వైద్యులు కేన్సర్ నిర్ధారణ, నివారణ చర్యలు గురించి వివరించారు. కేన్సర్ లక్షణాలను గుర్తించిన వెంటనే స్క్రీనింగ్, నిర్ధారణ తర్వాత చికిత్స ప్రారంభించే నయం చేయొచ్చన్నారు. అంతకుముందు ఆర్‌కె బీచ్ రోడ్డులో కేన్సర్ అవగాహన నడకను నిర్వహించారు. నగరంలోని వివిధ నర్సింగ్ కళాశాలల విద్యార్థినులు, వాకర్స్, రోటరీ, లయన్స్ క్లబ్, ఎబి ఛారిటబుల్ ట్రస్టు, జిందాల్ కార్పొరేట్, ఎయు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కేన్సర్‌కు భయపడే రోజులు పోయాయి

గీతంలో సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ

మధురవాడ : అత్యాధునిక చికిత్స విధానాలు అందుబాటులోకి రావడంతో కేన్సర్‌కు భయపడే రోజులు పోయాయని, 80శాతం రోగులు కేన్సర్‌ను జయిస్తున్నారని మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి, పరిశోధన సంస్థ మేనేజింగ్ డైరక్టర్, ఛీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. ఈ నెల 4న ప్రపంచ కేన్సర్ దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ, బయో ఇన్ఫర్మెటిక్స్ విభాగం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రపంచంలో గుండె జబ్బుల తరువాత కేన్సర్ వల్లే అధిక శాతం మంది మరణిస్తున్నారన్నారు. సెర్వికల్ కేన్సర్ కారణంగా మన దేశంలో ఏటా 3లక్షల మంది మహిళలు మృత్యువాత పడుతున్నారన్నారు. శరీరంలో కంతులు, నాలుగు వారాలైనా తగ్గని గాయాలు,స్వర పేటికలో ఆకస్మిక మార్పులు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కేన్సర్ వైద్యంలో టార్గెటెడ్ థెరపి, న్యూక్లియర్ థెరపి, ఇమ్యూనో థెరపి, జీన్ థెరపి వంటివి అందుబాటులోకి రావడంతో అధిక శాతం మందిని నయం చేయగలుగుతున్నామన్నారు. అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ ఎమ్. రామారావు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా కేన్సర్‌పై జరుగుతున్న పరిశోధనలను వివరించారు.

కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎమ్. బాలకుమార్, ఇన్చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేద వతి, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.విజయ రేచల్, నిర్వాహక కార్యదర్శి సిహెచ్.

ఉపాధ్యాయుల పర్యవేక్షణలేమిపై ఆగ్రహం

పాండ్రంగి పాఠశాలలను డిఇఒ చంద్రకళ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పద్మనాభం: విద్యార్థులు ఎలా చదువుతున్నారో కనీస పరిశీలన, పర్యవేక్షణ లేని ఉపాధ్యాయుల తీరుపై డిఇఒ చంద్రకళ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల్లో విద్యార్థుల అభ్యసన తీరును పరిశీలించారు. బైజూస్ పాఠాల అభ్యసనను అప్‌లోడ్ చేయకపోవడాన్ని గుర్తించి ఉపాధ్యాయులపై మండిపడ్డారు. విద్యార్థుల పాఠ్య, నోటుపుస్తకాలను పరిశీలించి, వాటిని కూడా పరిశీలించకపోవడాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులతో ముచ్చటించి, వారి విద్యాప్రమాణాలను పరిశీలించడంతోపాటు వారు ఏమేమి కావాలనుకుంటున్నారో వారితో చెప్పించారు. అర్థాంతరంగా బడికి రావడం మానేసిన పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి, కౌన్సిలింగ్ నిర్వహించారు. విద్యార్థులు చదువు కునేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని, వాటిని వినియోగించుకుని పిల్లలను చదివించాలని అవగాహన కల్పించారు.ఎటువంటి ఇబ్బందులున్నా, వారికి చదువుకు సహకరిస్తామని, కావాలనుకుంటే కస్తూర్బా పాఠశాలల్లో సీట్లు ఇప్పిస్తామని ఒప్పించారు. ఇటుక బట్టీల్లో పనిచేసిన కార్మికుల పిల్లలకు ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేస్తామని, బడిఈడు పిల్లలందరూ చదువుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వారికి అవగాహన కల్పించారు.


డ్రాపౌట్ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డిఇఒ చంద్రకళ

అక్రమ అరెస్టులపై యుటిఎఫ్ ఖండన

ప్రజాశక్తి- ఆనందపురం: సిపిఎస్ రద్దు చేయాలని విజయవాడ గన్నవరం దగ్గర ధర్నాస్థలిలో యుటిఎఫ్ తలపెట్టిన సంకల్ప దీక్షను అక్రమ అరెస్టలతో భగ్నం చేయాలన్న ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆనందపురం మండల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిరణ్‌కుమార్ సత్యనారాయణ తెలిపారు. యుటిఎఫ్ తలపెట్టిన సంకల్ప దీక్ష భగ్నానికి విశాఖలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, తాడాన అప్పారావు, జిల్లా కోశాధికారి టిఆర్ అంబేద్కర్, సిపిఎస్ జిల్లా కన్వీనర్ ఉప్పాడ రాము తదితరులను అక్రమ అరెస్టలను ఖండించారు. ఆత్మకూరు, గన్నవరం, వీరవల్లి తదితర పోలీస్ స్టేషన్లలో అక్రమంగా అరెస్ట్ చేసిన యుటిఎఫ్ శ్రేణులు బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

డయల్ యువర్ పోలీస్ కమిషనర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ప్రతి నెలా మొదటి శుక్రవారం నిర్వహించ తలపెట్టిన డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమం ఈ శుక్రవారం కమిషనరేట్‌లో ప్రారంభమైంది. ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ ఫిర్యాదులు స్వీకరించారు. సిపి 0891-2523408 నెంబరు ద్వారా అందుబాటులో ఉండి 20 మంది కాలర్స్‌తో ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నక్కవానిపాలెంలో గడపగడపకూ..


గడపగడపకూలో పాల్గొన్న కెకె.రాజు, కార్పొరేటర్ పద్మారెడ్డి

ప్రజాశక్తి- సీతమ్మధార: 24వ వార్డు నక్కవానిపాలెంలో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు, స్థానిక కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి గడపగడపకూ కార్యక్రమం నిర్వహించారు వార్డు పరిధిలో పలువీధుల్లో తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ నేరుగా సంక్షేమ పథకాలను అందించాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు.కార్యక్రమంలో అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బీమా తక్షణసాయం అందజేత

సీతమ్మధార : 24వ వార్డు గాంధీనగర్ చెందిన బసవ తోటయ్య ఇటీవలే మృతి చెందడంతో వైఎస్సార్‌బీమా కింద మంజూరైన తక్షణసాయం రూ.పది వేలను మృతుని కుటుంబసభ్యులకు శుక్రవారం ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త, రాష్ట్రనెడ్ క్యాప్ చైర్మన్ చైర్మన్ కెకె రాజు, స్థానిక కార్పొరేటర్ సాడి పద్మా రెడ్డి అందజేశారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వపరంగా సహాయసహకారాలు అందేలా కృషి చేస్తానని భరోసానిచ్చారు.

బీమా పరిహారం అందజేత


బాధితురాలికి చెక్కునందిస్తున్న వైస్ ఎంపిపి

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గంభీరం గ్రామంలో అనారోగ్యంతో మరణించిన చెందిన బొట్ట కనకరాజు భార్య రాధకు వైఎస్ఆర్ బీమా పరిహారం చెక్కును వైస్ ఎంపిపి బొట్టా ధనలక్ష్మి రామకృష్ణ శుక్రవారం అందజేశారు.బీమా పరిహారం కింద వచ్చే రూ.లక్ష సాయం బాధిత కుటుంబానికి భరోసాగా ఉంటుందని ధనలక్ష్మి వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బోయి రమణ, వానపల్లి ముత్యాలరావు, ఉప సర్పంచ్ శ్రీను, గ్రామ పెద్దలు రాజు నాయుడు, వాలంటీర్ శరణ్య పాల్గొన్నారు.

క్యాట్ ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


మెడల్స్, సర్టిఫికెట్స్‌తో ప్రతిభ చూపిన విద్యార్థులు

ప్రజాశక్తి-పిఎం.పాలెం: మధురవాడ బక్కన్నపాలెం రోడ్‌లోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో జరిగిన క్యాట్ ఒలింపియాడ్(నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్) సెకండ్ లెవెల్‌లో 68 మంది విద్యార్థులు సత్తా చాటారు. ఇందులో ఏడుగురు విద్యార్థులు మెడల్స్‌తో పాటు నగదు బహుమతిని గెలుచుకున్నారు. 49 మంది విద్యార్థులు మెడల్స్, సర్టిఫికెట్స్ గెలుచుకున్నారు. 12 మంది విద్యార్థులు సర్టిఫికెట్స్ గెలుచుకున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ సందీప్ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులలో ఉండే సజనాత్మకతను వెలికితీసి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు శ్రీచైతన్య విద్యా సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు శ్రీ చైతన్య పాఠశాల రీజినల్ ఇన్‌ఛార్జి అహ్మద్ అలీ నగదు బహుమతి, మెడల్స్, సర్టిఫికెట్స్‌ను అందించి అభినందించారు. ఎజిఎం సురేష్, వైస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వరరావు, డీన్ ఢిల్లేశ్వరరావు, సి-బ్యాచ్ ఇన్‌ఛార్జి జగదీష్, ఒలింపియాడ్ ఇన్‌ఛార్జి నీలిమ విద్యార్థులను అభినందించారు.

'దీప్తి'కి పురస్కారం


పురస్కారాన్ని అందుకుంటున్న దీప్తి

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని లొడగలవానిపాలేనికి చెందిన తాలాడ దీప్తికి అరుదైన పురస్కారం దక్కింది. ది లెప్రసీ మిషన్ ట్రస్ట్ ఇండియా ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ ఫెసిలిటీస్ (పిఐఎఫ్)గా పనిచేస్తున్న దీప్తి, . కుష్టు వ్యాధిగ్రస్తులు, వారి పిల్లలకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా యార్డ్స్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (బెంగళూరు)కు అనుబంధంగా ఉన్న సెయింట్ పాల్స్ థియాలజికల్ కాలేజీ యాజమాన్యం 'ఫాస్టర్ ఆఫ్ ఫెలోషిప్' అవార్డుతోపాటు గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని ప్రకటించారు. కుష్టు వ్యాధిగ్రస్తులకు దీప్తి చేస్తున్న సేవలను శోభశ్రీ, కెవిఎన్ పాల్, తాలాడ సతీష్ మాస్టర్ తదితరులు కొనియాడారు.

జీవనశైలిలో మార్పులతో కేన్సర్ నివారణ

కిమ్స్ ఐకాన్ చీఫ్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రఘునాధరావు


డాక్టర్ రఘునాధరావు

ప్రజాశక్తి -గాజువాక : జీవనశైలిలో మార్పులు ద్వారా కేన్సర్ నివారించవచ్చునని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి చీఫ్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రఘునాథరావు తెలిపారు. అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవ సందర్భంగా మాట్లాడుతూ, ఫిబ్రవరి 2 అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహనకు యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ కేన్సర్ కంట్రోల్, ఇంకా ప్రభుత్వాలు ప్రపంచ వ్యాప్తంగా కేన్సర్ రోగులకు అవగాహన కల్పించి, ఏటా మిలియన్ మందిని ఈ వ్యాధి నుంచి రక్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయన్నారు. ఈ ఏడాది ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం లక్ష్యం అనేక దేశాల్లో ఈ వ్యాధి సంరక్షణలో అసమానతలు తొలగించే ప్రయత్నంలో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశ్రీ పథకాలు కేన్సర్ బాధితుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నా యన్నారు. పొగాకు, ఆల్కహాల్, అల్ట్రా ప్రాసెస్ ఆహారం వల్లే ఎక్కువగా కేన్సర్ వచ్చే అవకాశం ఉన్నందున వాటిని మానేయాలని సూచించారు. నిత్య వ్యాయామం, ఊబకాయ నివారణ, గర్భాశయ కేన్సర్‌కు కారణమయ్యే హ్యూమన్ పాపిలోన్ వైరస్‌కు వ్యతిరేకంగా యువతులకు టీకాలు వేయడం, యూనివర్సల్ స్క్రీనింగ్ ప్రోత్సహించడం ద్వారా రోగ నిర్ధారణ చేసి కేన్సర్‌ను నిర్మూలించవచ్చని డాక్టర్ రఘునాథరావు సూచించారు.

ఆర్‌ఐఒగా ఉమారాణి


ఉమారాణి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.ఉమారాణి, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, విశాఖపట్నం ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐఒ)గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిలోని ఇంటర్ విద్యా కమిషనర్ నుంచి ఈ మేరకు ఉమారాణికి ఆర్ఐఒగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మద్దిలపాలెంలోని ప్రాంతీయ కార్యాలయంలో ఆమె బాధ్యతలు చేపట్టారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల అనర్థాలపై అవగాహన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న జివిఎంసి అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి- సీతమ్మధార : ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల కలిగే ఇబ్బందులపై జివిఎంసి కమిషనర్ ఆదేశాలతో పట్టణ ప్రణాళిక అధికారులు, ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సీతమ్మధార అల్లూరి విగ్రహం నుంచి హెచ్‌బి కాలనీ, సత్యం జంక్షన్, నక్కవానిపాలెం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టిపిఎస్ తేజ మాట్లాడుతూ ఫుట్‌పాత్ ఆక్రమణలతో పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తనున్న నేపథ్యంలో ప్రజలు సహకరించాలని కోరారు.

మధురవాడ, : ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగి, అభివృద్ధికి సహకరించాలని కోరుతూ శుక్రవారం ఏడోవార్డు మిథిలాపురి వుడాకాలనీలో జివిఎంసి అధికారులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కాలనీలో రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగి, సహకరించాలని కోరారు. లేకుంటే జివిఎంసి పరంగా తొలగించక తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా కొన్ని ఆక్రమణలను తొలగించారు. కార్యక్రమంలో జెడ్‌సి కనకమహాలక్ష్మి, సిసిపి కుమారస్వామి, ఎసిపి రఘునాథ్, టిపిఒ హేమంత్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'ఆపిల్' స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్



సైన్స్ ఎగ్జిబిషన్‌లో వివిధ ప్రాజెక్టులతో విద్యార్థులు

ప్రజాశక్తి -గాజువాక : శ్రీనగర్‌లోని ఆపిల్ ఇంగ్లీష్ మీడియం పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం ఆర్ట్ అండ్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను స్కూల్ చైర్మన్ బలరామకృష్ణ ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో సైన్స్‌కు సంబంధించి చెట్లు సంరక్షణ, గుండె పనితీరు, మానవ శరీర భాగాలు, నీటి పరిశుభ్రత తదితర 50 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. చంద్ర, సూర్యగ్రహణం తదితర అంశాలతో సోషల్ సైన్స్ ఎగ్జిబిషను కూడా ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పేదల భూముల కబ్జాపై చర్యలు తీసుకోవాలి

- వల్లూరులో ఆక్రమణకు గురవుతున్న పేదల ఇళ్ల స్థలాలను పరిశీలించిన సిపిఎం నాయకులు

- రిక్షా కార్మికులకు జగనన్న ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

పేదల భూములను కబ్జా చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని వల్లూరు గ్రామం 159 సర్వే నెంబర్లో గతంలో రిక్షా కార్మికులకు ఇళ్ల స్థలాల నిమిత్తం కేటాయించిన భూమిని అధికార పార్టీ నాయకులు కబ్జాకు యత్నిస్తున్నట్లు తెలుసుకున్న సిపిఎం నాయకులు శుక్రవారం ఆ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎ.బాలకృష్ణ, ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్ మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు ఈ భూమిని కబ్జా చేసి పేదలకు అన్యాయం చేయడం తగదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించిన ఈ భూముల్లో వారికే జగనన్న గృహ నిర్మాణం పథకం కింద ఇళ్లు మంజూరు చేసి నిర్మాణం చేయాలని కోరారు. కలెక్టర్ గతంలో ఇచ్చిన హామీ మేరకు ఎరుకువానిపాలెం, వల్లూరు, రాజుపాలెం గ్రామాల్లో ఇళ్లు లేని పేదలకు, కూలీలకు, వృత్తిపనివారికి ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ ప్రాంతంలో లాజిస్టిక్ హబ్ పేరుతో పేద రైతుల నుంచి భూములను స్వాధీనం చేసుకున్న ఎటువంటి నిర్మాణం చేపట్టలేదని, తక్షణమే లాజిస్టిక్ హబ్ నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ భూ సేకరణలో రైతులు కూలీలకు జీవనాధారమైన పంట భూములు బీడు భూములుగా మారాయని, వారికి చెల్లించాల్సిన నష్టపరిహారం, ప్యాకేజీలు నేటికీ ఇవ్వలేదని, తక్షణమే మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం పేదలకు న్యాయం చేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

7, 8 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ

ప్రజాశక్తి- అనకాపల్లి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా మహాసభ ఈ నెల 7, 8 తేదీల్లో అనకాపల్లి దొడ్డి రామునాయుడు కార్మిక, కర్షక నిలయంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.రమణ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అనకాపల్లి కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటు చేయాలని, హాస్టల్ విద్యార్థులకు మెనూ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరగడమే కాక గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు, విశ్వవిద్యాలయాలకు తక్కువ నిధులు కేటాయించడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో విద్యారంగ సమస్యలపై ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు జిల్లా మహాసభలు చర్చించనున్నట్లు చెప్పారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ అనకాపల్లి డివిజన్ కార్యదర్శి గొర్లి తరుణ్, నాయకులు బాబ్జి, ప్రసాద్ పాల్గొన్నారు.

మండల పరిషత్తు మాజీ అధ్యక్షులు నర్సింగరావు మృతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం :



నర్సింగరావు (ఫైల్‌ఫోటో)

అచ్యుతాపురం మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు రాజాన నర్సింగరావు అచ్యుతాపురం పంచాయతీ, కుమార్‌పురంలోని ఆయన స్వగృహంలో శుక్రవారం మృతి చెందారు. నర్సింగరావు మూడు పర్యాయాలు మండల పరిషత్ అధ్యక్షులుగా, ఒక పర్యాయం జెడ్పిటిసి సభ్యుడిగా పదవులు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని, ఆ పార్టీ ద్వారా ఈ పదవులు అలంకరించారు. నర్సింగరావు కుటుంబికులను ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు, పార్టీ సీనియర్ నాయకులు కోన బుజ్జి, జెడ్పిటిసి సభ్యులు రాంబాబు, నర్మాల కుమార్, కే విమల నాయుడు, కొండ్రపు రమణ, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు తదితరులు పరామర్శించారు.

జగనన్న ఇళ్లకు రూ.5 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : జగనన్న ఇంటి నిర్మాణానికి అందిస్తున్న రూ.1.80 లక్షలు ఏ మూలకు సరిపోవడం లేదని, ప్రతి ఇంటికి రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి గొర్లె దేముడు బాబు డిమాండ్ చేశారు. ఈనెల 22న విజయవాడలో నిర్వహిస్తున్న మహాధర్నా పోస్టర్‌ను శుక్రవారం మద్దివలసలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు గత ప్రభుత్వ హయాంలో 90శాతం పూర్తయినా నేటికీ వాటిని లబ్దిదారులకు ఇవ్వకుండా కాలయాపన చేయడం భావ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రెడ్డి అప్పలనాయుడు, ఇల్లాకు రాము, పొంతపల్లి రామారావు, సీమసిరి సూర్యనారాయణ, రామ నాయుడు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని ఉపాధి కూలీల నిరసన

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ పరవాడలోని పని ప్రదేశంలో కూలీలు శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 2022 నవంబర్ 24 నుండి మండలంలోని ఉపాధి హామీ కూలీలకు వేతనాలు చెల్లించకపోవడం విచారకరమన్నారు. వెంటనే వేతనాలు చెల్లించకుంటే కూలీలతో ఎంపిడిఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కోత పెట్టిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రొంగలి రవణమ్మ, గండి లక్ష్మీ, బి.సన్యాసమ్మ, వర్రి కుమారి, ఊర్మిళ, వరలక్ష్మి, పి వరలక్ష్మి, బి నందిని తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

చట్టాన్ని అర్థం చేసుకోవడంలో సాహిత్యం పాత్ర కీలకం

జాతీయ సదస్సులో కర్ణాటక లా కమిషన్ చైర్మన్ బన్నూరుమఠ్



బన్నూరుమఠ్‌ను సత్కరిస్తున్న లా వర్సిటీ విసి

ప్రజాశక్తి-సబ్బవరం

చట్టాన్ని అర్థం చేసుకోవడంలో సాహిత్యం కీలక పాత్ర పోషిస్తుందని, చట్టంలోని చిక్కులను అర్థం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సాహిత్య అవగాహన కల్గి ఉండాలని కర్ణాటక లా కమిషన్ చైర్మన్, కేరళ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎస్ఆర్.బన్నూరుమఠ్ అన్నారు. 'ది ఇంటర్‌ఫేస్ ఆఫ్ లా అండ్ లిటరేచర్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు మండలంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో శుక్రవారం ప్రారంభమైంది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న బన్నూరుమఠ్ భాష ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. కనీసం వారానికి ఒక్కసారైనా సాహిత్యంలోని మెలకువలను తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. జస్టిస్ కృష్ణయ్యర్ నిర్ణయాలు, తీర్పులను పరిశీలిస్తే ఆయన భాషను ఉపయోగించడంలో నైపుణ్యత తెలుస్తుందన్నారు. మినర్వా మిల్స్ కేసులో కూడా ఇంగ్లీష్ భాష ఆవశ్యకత తెలుస్తుందని చెప్పారు. డిఎస్ఎన్ఎల్‌యు లా, లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ సెంటర్‌ను ఏర్పాటు చేసినందుకు వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎస్.సూర్య ప్రకాష్‌ను ఆయన అభినందించారు. లా వర్సిటీ విసి ఆచార్య సూర్య ప్రకాష్ మాట్లాడుతూ చట్టం, సాహిత్యం మధ్య ఉన్న ఈ అంతర్గత సంబంధాన్ని బహిర్గతం చేయడానికి ఈ సమావేశం సహాయపడుతుందని చెప్పారు. ప్రొఫెసర్ ముఖేష్ శ్రీవాస్తవ, ప్రొఫెసర్ టి.విశ్వనాథరావు, ప్రొఫెసర్ కొట్టి రమేష్, ప్రొఫెసర్ ఎ.రామనాగ హనుమంతు, డాక్టర్ వరలికర్ ఊర్మిళ అతుల్ తదితరులు ముఖ్య వక్తలుగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కె.మధుసూదనరావు, సెంటర్ ఫర్ లా, లాంగ్వేజ్, సాహిత్యం, ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ నరసింగరావు భరణికాన, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రైతులు, కూలీలకు అన్యాయం

అఖిలపక్ష రైతు సంఘాలు



సమావేశంలో పాల్గొన్న రైతు నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ రైతులకు, కూలీలకు తీవ్ర నష్టం కలిగించేదిగా ఉందని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు విమర్శించారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో శుక్రవారం జరిగిన అఖిలపక్ష రైతు సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం ఇంతవరకు ప్రవేశపెట్టిన అన్ని బడ్జెట్లలోనూ రైతులకు, వ్యవసాయ రంగానికి నిధులు కోత పెట్టి ఆ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఎరువులపై రూ.50 వేల కోట్లు, ఉపాధి హామీ చట్టానికి రూ.30 వేల కోట్లు కోత విధించిందని తెలిపారు. దీని వల్ల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉందన్నారు. గతేడాది చేసిన ఉపాధి హామీ పనులకు ఇంత వరకు రూ.16 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. వలసలు నివారించేందుకు ఉపాధి హామీ నిధులు పెంచాల్సింది పోయి తగ్గించడం దారుణమన్నారు. ఈ బడ్జెట్‌ను బలపరుస్తున్న తెలుగుదేశం, వైసిపి, జనసేన పార్టీలను రైతులు కూలీలు నిలదీయాలని పిలుపునిచ్చారు. మూతపడ్డ చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించడం, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేయడం, విశాఖ రైల్వే జోన్, వెనుకబడ్డ రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీలు, పోలవరం ప్రాజెక్టు వంటి వాటిపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదని, వాటిపై ప్రకటన వచ్చే వరకు పోరాటాలను ముమ్మరం చేయాల్సి ఉందని తెలిపారు. ఏప్రిల్ 5న జరగనున్న చలో పార్లమెంటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఏపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైతు స్వరాజ్య వేదిక నాయకులు చక్రధర్, ఏపీ రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు, కాళ్ల తేలయ్య బాబు, ఏఐటియుసి నాయకులు వైఎన్ భద్రం, కోరిబిల్లి శంకర్రావు, నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి తహశీల్దారుగా సురేష్ నాయుడు



ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండల ఇన్‌ఛార్జి తహశీల్దారుగా సురేష్ నాయుడు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి తహశీల్దారు బి.సుధాకర్‌ను ఇటీవల సస్పెండ్ చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో డిప్యూటీ తహశీల్దారుగా ఉన్న సురేష్ నాయుడును ఇన్‌ఛార్జి తహశీల్దారుగా నియమిస్తూ కలెక్టర్ కార్యాలయం నుండి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సురేష్ నాయుడు గతంలో చోడవరం డిప్యూటీ తహశీల్దారుగా విధులు నిర్వహించి బదిలీపై కసింకోట డిప్యూటీ తహశీల్దారుగా వచ్చి ఏడాది కావస్తోంది.

వైసిపిలో 15 కుటుంబాల చేరిక

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ గ్రామానికి చెందిన 15 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీని వీడి వైసిపిలో చేరారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు వారికి గురువారం రాత్రి వైసిపి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదర్శాలు తమను ప్రభావితం చేశాయని, బూడి ముత్యాలనాయుడు నాయకత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, అందుకే వైసిపిలో చేరినట్లు వారు తెలిపారు. వైసిపిలో చేరిన వారిలో గ్రామానికి చెందిన రొంగలి వాసుదేవరావు, కామిరెడ్డి రమణ, ఎర్ర తాతయ్యలు, సిరికి సింహాద్రప్పడు, సూర్రెడ్డి తాతయ్యలు, గండిబోయిన భవాని, దేవుడమ్మ, పోతల శ్రీను తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు తదితరులు పాల్గొన్నారు.

96వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఓబి 8 గ్రామాల నిర్వాసితులు నేవీ గేట్ వద్ద చేస్తున్న ఆందోళన శుక్రవారం నాటికి 96వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నిర్వాసిత జెఎసి నాయకులు మాట్లాడుతూ ఎనిమిది గ్రామాల నిర్వాసితులు చేపల వేట లేక ఉపాధి పోయి, కుటుంబాలను పోషించుకోవడానికి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 96 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. మా సహనాన్ని పరీక్షించవద్దని, తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జి.దేవుడు నాయుడు, ఎనిమిది గ్రామాల నిర్వాసితులు, జెఎసి పెద్దలు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నేవీ నిర్వాసితులు



మాట్లాడుతున్న టిడిపి నాయకులు పివిజి.కుమార్

నిలుపుదల చేసిన పింఛన్లను విడుదల చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కొత్తపెంట గ్రామంలో నిలుపుదల చేసిన పింఛన్లను తక్షణమే విడుదల చేయాలని టిడిపి మాడుగుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తపెంట గ్రామంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులకు 2020 నుంచి పింఛన్లు ఇస్తున్న వైసిపి ప్రభుత్వం నేడు కక్ష సాధింపు చర్యల్లో భాగంగా నిలుపుదల చేయడం అన్యాయమన్నారు. సంక్షేమ పథకాలను నిలిపివేస్తామని భయపెట్టి వైసిపిలో చేరాలని ఒత్తిడి చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే నిలుపుదల చేసిన పింఛన్లను లబ్ధిదారులకు అందజేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ జెడ్‌పిటిసి పి.సత్యవతి, టిడిపి నాయకులు బండారు రామారావు, దొగ్గ దేముడు నాయుడు, గుర్రపోటు నరసింహమూర్తి, రొంగలి శంకర్రావు, దొర తదితరులు పాల్గొన్నారు.

కొఠారి కృష్ణకు టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని నూతన గుంటపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొఠారి కృష్ణ దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి ఆధ్వర్యాన టిడిపి నాయకులు శుక్రవారం కృష్ణను పరామర్శించారు. కృష్ణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలం ఉపాధ్యక్షులు కలగా సోమేశ్వరరావు, సిద్దిరెడ్డి సూర్యనారాయణ, వులింగల రమేష్, జెర్రిపోతుల నూకు నాయుడు, చింతలపాలెం మాజీ సర్పంచ్ కర్రి దుర్గ నాయుడు, మాజీ ఎంపిటిసి కలిగెట్ల సరస్వతి, మాజీ సర్పంచ్ బుద్దిరెడ్డి చిట్టిబాబు పాల్గొన్నారు.

గృహ నిర్మాణంపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - పరవాడ : పరవాడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పైలా వెంకట పద్మా లక్ష్మి శ్రీనివాస్ అధ్యక్షతన జగనన్న ఇళ్ల కాలనీలు త్వరితగతిని పూర్తి చేయడానికి గృహ నిర్మాణ శాఖ ఇంజనీరు, గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఉగాది నాటికి గృహ నిర్మాణాలు 92 శాతం పూర్తి చేయాలన్నారు. ఎంపిడిఓ హేమసుందర్రావు మాట్లాడుతూ సాంకేతిక పరమైన కారణాలతో ఇప్పటివరకు గృహ నిర్మాణం ప్రారంభించని లబ్దిదారులను తొలగించడానికి ప్రతిపాదనలు శనివారం సాయంత్రం లోపు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరరావు పరవాడ-2 ఎంపిటిసి పైల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్యం చేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాలని యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు అన్నారు. మండలంలోని గ్రామ వాలంటీర్లు, గృహ సారధులు, కన్వీనర్లకు మండల కేంద్రంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేయాలని కోరారు. వాలంటీర్ల పరిధిలో ఎవరికైనా ఇటువంటి సమస్యలున్నా వాటిని అందరూ కలిసికట్టుగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రొంగలి జగన్నాథం, డిసిసిబి మాజీ ఛైర్మన్ సుకుమార వర్మ, జడ్పిటిసి రాంబాబు, నర్మాల కుమార్, పార్టీ సీనియర్ నాయకులు కోన బుజ్జి, మండల వాలంటీర్ల కన్వీనర్ రాజాన విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ స్టిక్కర్లు ఎమ్మెల్యే కనబాబురాజు చేతుల మీదుగా విడుదల చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి రాజు

జగనన్న విదేశీ విద్యా దీవెన ప్రారంభం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలువురు విద్యార్థులకు ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి తదితరులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని విశాఖ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రారంభించారు. విశాఖపట్నం జిల్లాకు సంబంధించి అర్హులైన 16 మంది విద్యార్థులకుగాను తొలి విడతగా 11 మంది విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద రూ.కోటి 16 లక్షల 78 వేల 756 సాయం లబ్ధి చేకూరిందని తెలిపారు. ఆ మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణితో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ పథకానికి అర్హతగల ప్రతి విద్యార్థీ దరఖాస్తు చేసుకోవాలని, తద్వారా విదేశీ విద్యను పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ పల్లా చినతల్లి, నగరాల ఛైర్‌పర్సన్ పిల్లా సుజాత, ఫిషరీస్ ఛైర్మన్ కోలా గురువులు, గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ కొండా రమాదేవి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, బిసి వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, జిల్లా అల్ప సంఖ్యాకుల సంక్షేమ అధికారి ఎం.ఎ.రహీమ్, పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రూ.49.55 లక్షలు విడుదల

అనకాపల్లి : కలెక్టరేట్‌లో శుక్రవారం జగనన్న విదేశీ విద్య దీవెన పథకం కింద జిల్లాలో ఐదుగురు విద్యార్థులకు రూ.49,55,857 కలెక్టర్ రవి పఠాన్ శెట్టి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద ప్రపంచంలోనే ఉన్నత క్యూఎస్ ర్యాంక్ కలిగిన విశ్వవిద్యాలయాలు, విద్య సంస్థల్లో పీజీ, పిహెచ్‌డి, ఎంబిబిఎస్ కోర్సులు అభ్యసించేందుకు సంవత్సరానికి రూ.8 లక్షలు ఆదాయంలోపు ఉన్న బీసీ, ఈబీసీ, కాపు విద్యార్థులు ఏడాదికి రెండుసార్లు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. 35 ఏళ్ల లోపు ఉండి, 60 శాతం మార్కులు వచ్చి ఉండాలన్నారు. ముందుగా తాడేపల్లిలో ముఖ్యమంత్రి కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగన్మోహన్ రెడ్డి ప్రత్యక్ష ప్రసారాన్ని అధికారులు, విద్యార్థులు తల్లిదండ్రులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రాజేశ్వరి, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ టి అజయ్ బాబు, ఏబిసిడబ్ల్యూఓ. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి 56 వేల గృహాలు సిద్ధం



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కుర్మినాయుడు

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఉగాది నాటికి అనకాపల్లి జిల్లాలో 56 వేల గృహాలను సిద్ధం చేస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కుర్మినాయుడు తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్మిస్తున్న జగనన్న ఇళ్లను డిఈ శామ్యూల్ రాజుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాకు రూ.330 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఇళ్ల లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా వెంట వెంటనే బిల్లులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు పనులు మొదలు పెట్టలేని లబ్ధిదారుల పట్టాలను రద్దు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని, అటువంటి పరిస్థితి తెచ్చుకోకుండా వెంటనే ఇంటి నిర్మాణాలను చేపట్టాలని కోరారు. 60 వేల బస్తాలు సిమెంటు, 130 టన్నుల ఐరన్ సిద్ధంగా ఉందని, ఇసుక కొరత లేకుండా చూస్తున్నామని తెలిపారు. కె.కోటపాడు మండలంలో 95శాతం గ్రౌండ్ లెవెల్ పూర్తి చేసుకుని నిర్మాణాలు సాగుతున్నాయని, ఉగాది నాటికి పూర్తి చేయించడానికి తమ సిబ్బంది తీవ్రంగా కృషి చేస్తున్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ రవిబాబు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

నైపుణ్య ఆధారిత విద్యతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి- అనకాపల్లి : నైపుణ్య ఆధారిత విద్యతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ప్రధాన సమన్వయకర్త, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సలహాదారు బుద్ధ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక గౌరీ గ్రంథాలయం 80వ వార్షికోత్సవం సందర్భంగా ఉన్నత విద్య -నైపుణ్యం -ఉపాధి అనే అంశంపై జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. యువత ఉపాధి కల్పన సృష్టికర్తలు కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్విభాష అచ్చు పుస్తకాలను పంపిణీ చేయడం అద్భుతమన్నారు. విద్యతోపాటు కాలానుగుణంగా వస్తున్న మార్పులకు సృజనాత్మకత, వినూత్న గుణాత్మక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం గౌరీ గ్రంథాలయం పాలకవర్గం చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిమ శేఖర్ కళాశాల కరస్పాండెంట్ కొణతాల జనార్దన్, గ్రంథాలయ అధ్యక్షులు దొడ్డి నూక అప్పారావు, కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, కోశాధికారి బి.కృష్ణ అప్పారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని జాతీయ రహదారి నుండి ఉగ్గినపాలెం గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు ఆధ్వర్యాన శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరు వైపులా పిచ్చి మొక్కలు పెరిగి పోవడంతో గ్రామానికి రాకపోకలు సాగించే వారు పడుతున్న ఇబ్బంతులను దృష్టిలో పెట్టుకొని తొలగించినట్లు చెప్పారు.

ఎరువు పరిశీలన

ప్రజాశక్తి- కశింకోట : కశింకోటలో ఉన్న చెత్త నుండి సంపద కేంద్రంలో తయారు చేసిన ఎరువును శుక్రవారం ఎంపిడిఓ కొంకి అప్పారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంపద కేంద్రంలోనూ ఎరువులు తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సచివాలయం సిబ్బంది ఉన్నారు.



సంఘటన స్థలంలో సన్నిబాబు మృతదేహం, క్షతగాత్రులు

ద్విచక్ర వాహనాలను ఢీకొన్న జీపు

- ఒకరు దుర్మరణం, నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : దేవరాపల్లి- కొత్తవలస రోడ్డులోని చిన్నగుడిపాల జంక్షన్ వద్ద శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలను జీపు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఈ ప్రమాదంలో విజయనగరం జిల్లా, వేపాడ మండలం చిన్న గుడిపాల గ్రామానికి బాలి బోయిన సన్నిబాబు (52) అక్కడికక్కడే మృ చెందారు. ఆయన భార్య దేముడమ్మకు, మరో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న వేపాడ మండలం భర్తవానిపాలెం గ్రామానికి చెందిన సిహెచ్.లక్ష్మణ, గండి సంజీవరావుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న దేవరాపల్లి ఎస్ఐ డి.నాగేంద్ర తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ముగ్గురు క్షతగాత్రులను కె.కోటపాడు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆలయంలో హుండీని పరిశీలిస్తున్న పోలీసులు

ఆలయాల్లో హుండీ సొమ్ము అపహరణ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో హుండీలను పగలగొట్టి భక్తులు వేసిన ముడుపుల నగదును దొంగలు అపహరించుకుపోయారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని దిబ్బిడి, బుచ్చయ్యపేట, కెపి.అగ్రహారం, కొండపాలెం గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో ఎనిమిది హుండీలను గురువారం రాత్రి దొంగలు పగలగొట్టి వేలాది రూపాయలను చోరీ చేశారు. దిబ్బిడి గ్రామంలో 2, బుచ్చయ్యపేటలో 2 కేపీ అగ్రహారంలో 1, కొండపాలెం గ్రామాలలో 3 హుండీలను దొంగలు దోచుకున్నారు. నగదు అపహరణ అనంతరం ఈ హుండీలను గ్రామ శివారులలో విడిచిపెట్టారు. ఈ మేరకు ఆయా గ్రామాలు ప్రజలు శుక్రవారం బుచ్చయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం రంగంలో దిగింది. దిబ్బిడి గ్రామంలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద గల సిసి పుటేజీని బుచ్చయ్యపేట ఎస్సై కుమారస్వామి ఆధ్వర్యంలో పరిశీలించారు. అనుమానస్పదంగా తిరిగిన వారి వివరాలను సేకరించారు. దిబ్బిడి ఆంజనేయస్వామి గుడి వద్ద హుండీపై దొంగల వేలిముద్రలను క్లూస్ పోలీసులు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కుమారస్వామి తెలిపారు.

నూతన పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి -దేవరాపల్లి : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా గుర్తించి లబ్దిదారులకు నూతనంగా మంజూరైన పింఛన్లను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శుక్రవారం తారువలోని తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. మొత్తం 15 వికలాంగులు, వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసీలు, వైఎస్సార్సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన పాల ఉత్పత్తిపై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : పరిశుభ్రమైన పాల ఉత్పత్తి, దాని వల్ల వచ్చే లాభాలు, తీసుకోవాలని చర్యలపై అవగాహన కార్యక్రమం మండలంలోని చింతలపాలెంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా విశాఖ పశు విజ్ఞాన బడి స్పెషలాఫీసర్ డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ ప్రతి రైతు జగనన్న పాలవెల్లువను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దూడలు పెంపకం, పశుపోషణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొట్నే రాము, జగనన్న పాల వెల్లువ నోడల్ అధికారి భానుబాబు, కశింకోట, నరిశింగబిల్లి పశు వైద్యాధికారులు అల్లుహన్స్ జార్జ్, చైతన్య మణి, పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

ఎంపిపి, కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక

ఎస్.రాయవరం, పాయకరావుపేటలో ఏకగ్రీవం.. కోటవురట్లలో వైసిపి సభ్యుల ఘర్షణ



అభినందనలు తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండల ఎంపిపిగా పెనుగొల్లు ఎంపిటిసి కోన లోవలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతిరావు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో మాజీ ఎంపిపి బొలిశెట్టి శారదాకుమారి కోన లోవలక్ష్మి పేరును సూచించారు. రాయవరం ఎంపిటిసి బైపా శ్రీనివాసరావు బలపరిచారు. ఒక్క నామినేషనే రావడంతో కోన లోవలక్ష్మిని ఎంపిపిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రత్యేకాధికారి ప్రకటించారు.

మండలంలో ఇరవై ఎంపిటిసి స్థానాలుండగా పదహారు స్థానాల్లో వైసిపి సభ్యులు, మూడుచోట్ల తెలుగుదేశం సభ్యులు, ఒక స్థానంలో జన సేన సభ్యులు గెలుచుకున్నారు. ఈ ఎన్నికకు తెదెపా, జనసేన సభ్యులు గైర్హాజరయ్యారు. ఎన్నికల ప్రత్యేక ఆహ్వానితులుగా మాజీ ఎమ్మెల్యే బాబూరావు, పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకులుగా చింతలపూడి వెంకటరామయ్య, జెడ్‌పిటిసి కాకర దేవి పాల్గొనగా స్థానిక ఎంపిడివో శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షించారు.

వైస్ ఎంపీపీ 2 ఉప ఎన్నిక ఏకగ్రీవం

పాయకరావుపేట:పాయకరావుపేట వైస్ ఎంపీపీ 2గా నరసాపురం ఎంపీటీసీ పల్లెల మణికంఠ స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు శుక్రవారం స్థానిక మండల కాంప్లెక్స్ ఆవరణలో శ్రీ శక్తి భవనంలో ఎన్నికల అధికారి సిహెచ్ లచ్చన్న ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో పల్లెల మణికంఠ స్వామి ఒకరే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది ఎంపీపీ ఇసరపు పార్వతి, పాల్తేరు ఎంపీటీసీ సభ్యులు 2 సత్యనారాయణ మణికంఠ స్వామిని ప్రతిపాదించారు మిగిలిన సభ్యులు అందరూ ఏకగ్రీవంగా బలపరిచారు దీంతో వైస్ ఎంపీపీ 2 గా మణికంఠ స్వామి ఎన్నికైనట్లు ప్రకటించిన ఎన్నికల అధికారి లచ్చన్న స్వామికి ధ్రువీకరణ పత్రం అందజేశారు గతంలో వైస్ ఎంపీపీ టూ గా పనిచేసిన వెంకట్ నగరం ఎంపీటీసీ కోడ నల్ల అబ్బాయి రోడ్డు ప్రమాదంలో మతి చెందిన విషయం తెలిసిందే మళ్లీ అదే స్థానంలో ఉప ఎన్నిక శుక్రవారం నిర్వహించారు ప్రస్తుతం మండల ఉపాధ్యక్షుడు టూ గా ఎన్నికైన మణికంఠ స్వామి మాట్లాడుతూ ఈ ఎన్నికకు ఏకగ్రీవంగా ఎన్నికలు సహకరించిన ఎంపిటిసి సభ్యులకు, పాయకరావుపేట ఎమ్మెల్యే బాబు, దేవర సూర్య చక్రంకు, పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గుటూరు శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు బాబురావు, మండల నాయకులకు ఎంపీపీ పార్వతకు మైలుపల్లి అశోక్ చక్రవర్తి ఈ గెలుపుకు శ్రమించిన వైసీపీ నాయకులకు కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదములు తెలియజేసారు మణికంఠ స్వామిని ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి సిహెచ్ లచ్చన్న , ఎంపీడీవో సాంబశివరావు, ఈవో పీఆర్డి చంద్రశేఖర రావు, సిఐ పాలిన అప్పలరాజు, ఎస్ఐ రమేష్, తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ సభ్యుల రగడ..

కోటవురట్ల: మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కోఆప్షన్ సభ్యుని ఎన్నికల్లో మండల వైసిపి అధ్యక్షులు పైల రమేష్, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు దత్తుడురాజుకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా దత్తుడురాజు తీసుకున్న నిర్ణయం పట్ల పైల రమేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కోఆప్షన్ సభ్యురాలు క్రిస్టియన్ మైనారిటీ వర్గానికి చెందిన ఎం.సువర్ణలత రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది.కో ఆప్షన్ సభ్యుని ఎన్నిక తిరిగి క్రిస్టియన్ మైనార్టీ వర్గానికి చెందిన వారికి కాకుండా ముస్లిం మైనార్టీ వర్గానికి కేటాయించడం పట్ల పైల రమేష్ వైస్ ఎంపీపీ దత్తుడురాజుపై తీవ్ర ఆగ్రహం అసహనం వ్యక్తం చేశారు. మండలంలో షెడ్యూల్ కులాలు, బిసి, ఇతర కులాల వారిని చిన్న చూపు చూడటం సరికాదన్నారు. తండ్రీ కొడుకులు ఇద్దరు మండలంలో ఇసుక మట్టి అమ్ముకోవడమే కాకుండా, గ్రామస్థాయి నాయకులను సంప్రదించకుండా కాంట్రాక్టు వర్క్‌లు వారే చేస్తున్నారన్నారు. అంగన్వాడీ పోస్టులను సైతం అమ్ముకున్నారని పైల రమేష్ ఆరోపించారు.ఒక దశలో స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావుకు ఫోన్ చేశారు .నియోజకవర్గానికి ఎమ్మెల్యే అయ్యివుండి మండలంలో ఏమి జరుగుతుందో చూసుకునే బాధ్యత లేదా అని దురుసుగా హెచ్చరించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై నారాయణరావు అక్కడకు చేరుకొని గొడవలు సద్దుమణికే విధంగా చర్యలు చేపట్టారు.

మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన కోఆప్షన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. కోటవురట్ల గ్రామంలో ముస్లిం వర్గానికి చెందిన షేక్ ఖుదాభాషా వైసీపీ నుండి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఈ మేరకు దృవపత్రాన్ని కో ఆప్షన్ సభ్యులకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు దత్తుడురాజు, చెక్క సుజాత, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఘర్షణ పడుతున్న వైసిపి సభ్యులు



సత్కరిస్తున్న ఎన్జీవో నాయకులు

ఎంపిడిఒ సీతారామరాజుకు సత్కారం

ప్రజాశక్తి-నక్కపల్లి:ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం కార్యదర్శిగా ఏక గ్రీవంగా ఎన్నికైన నక్కపల్లి ఎంపీడీవో డి.సీతారామరాజును నక్కపల్లి ఏపీఎన్జీవో సంఘం యూనిట్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూనిట్ అధ్యక్షులు మజ్జి గణపతిరావు మాట్లాడుతూ, సీతారామరాజు యూనియన్ నాయకునిగా ఎన్నో ఏళ్ల నుండి ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యల పరిస్కారానికి అంకితభావంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఏపీఎన్జీవో ఉపాధ్యక్షులు ఎం .శ్రీను, ప్రసాద్‌లు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, మూర్తి, కన్నబాబు పాల్గొన్నారు.




గ్రామస్తులతో మాట్లాడుతున్న రాజు, సిఐ

'శివ లింగాలను ప్రతిష్టించాలి'

ప్రజాశక్తి -కొత్తకోట:కల్యాణ పోతురాజుబాబు శివాలయంలో తొలగించిన శివ లింగాలను తక్షణమే యథాతథంగా ఏర్పాటు చేయాలని, గిరిజన ప్రజల మనో భావాలను కించ పరిచే విధంగా వ్యవరించిన దేవాదాయ శాఖ అధికారులపై చర్యలు చేపట్టాలని చోడవరం మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, టిడిపి ఇన్‌ఛార్జ్ బత్తుల తాతయ్యబాబు, జనసేన ఇంచార్జ్ పివిఎస్ ఎన్.రాజు తదితరులు డిమాండ్ చేశారు. కల్యాణపోతురాజు బాబు శివాలయాన్ని శుక్రవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మహా శివ రాత్రి ఉత్సవాల సందర్భంగా అభివృద్ధి పేరుతో సుమారు 50 ఏళ్ల కిందట శాస్త్రియం గా ప్రతిష్టించిన శివ లింగాలను అశాస్త్రీయ పద్దతిలో తొలగించడం, స్థానిక గిరిజనులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గోప్యత పాటించడం వెనుక ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని సిఐ సందర్శించారు. ఈ కార్యక్రమం లో టిడిపి మండల శాఖ అధ్యక్షులు రాజాన కొండనాయుడు, గాలి రమణ, బద్రి చినబ్బాయి, జనసేన నాయకులు దాసరి చినబాబు పాల్గొన్నారు.

నేడు గృహ సారథులు, కన్వీనర్లతో సమావేశం

- సచివాలయ మండల కన్వీనర్ శాంతారాం



ప్రజాశక్తి-గొలుగొండ:నూతన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లుకు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఈనెల 4న ఏర్పాటు చేసినట్లు సచివాలయ మండల కన్వీనర్ కొరుప్రోలు పాణి శాంతారాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో గత వారం రోజులుగా ప్రతి సచివాలయ పరిధిలో గృహ సారథులు, కన్వీనర్లను మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ సహకారంతో నియమించామన్నారు. మండలంలో 640 మంది గృహ సారథులను, 60 మంది కన్వీనర్లను నియమించామన్నారు. కొత్తగా ఎంపికైన వీరితో పాటు వాలంటీర్లకు ఈనెల 4న శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఉందన్నారు. వీరందరికీ ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేస్తారన్నారు.

వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌పై చర్యలు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కుసర్లపూడి గ్రామ పంచాయతీ కుసర్లపూడి సచివాలయంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఎల్. సూర్యనారాయణను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని ఎంపిడిఒ పి.ప్రభాకరరావు ప్రకటనలో పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం, ఆధార్‌లో వయస్సులు మార్చి చేయూత పథకానికి దరఖాస్తు చేయడం, కారణం లేకుండా పింఛన్ల తొలగింపు, ఒక్క వర్గానికే సంక్షేమ పథకాలు అమలు చేయడం తదితర వాటిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయని, విచారణలో రుజువు కావడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఎంపిడిఒ పేర్కొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని జోగుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్క్రీనింగ్ ప్రోగ్రాంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పి సాయిమణి మాట్లాడుతూ, విద్యార్థులు పౌష్టికాహారం తీసుకొని పరిశుభ్రత పాటించాలన్నారు. మంచి ఆహారం తీసుకోవడంతో రక్తహీనతను అరికట్టవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎం విజయకుమారి, ఆశ కార్యకర్తలు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:స్థానిక ఫారెస్ట్ రేంజర్ కార్యాలయం ఎదుట జీడి, మామిడి పంట సాగు రైతులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ, టీ. జగ్గంపేట కంపార్ట్మెంట్ నెంబర్ 1168లో జగ్గంపేట, తిమ్మాపురం, కైలాసపట్నం, కోడవలపూడి వెంకటాపురం గ్రామాల నిరుపేద కుటుంబాలు సుమారు 40 సంవత్సరాల నుండి 150 కుటుంబాల రైతులు సాగు చేసుకుని జీడి తోటల సాగు చేపట్టి జీవనం సాగిస్తున్నా రన్నారు. ఈ తరుణంలో 5 సంవత్సరాలుగా ఆ జీడి తోటలో ఫారెస్ట్ అధికారులు వేలంపాట పెడుతు న్నారన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పాటను అడ్డుకుంటూ సాగులో ఉన్న పేద రైతులకు న్యాయం చేయాలని కోరారు. పేద రైతులకు న్యాయం చేయకపోతే మరింతగా ఉద్యమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్ష కార్యదర్శులు మాకిరెడ్డి రామునాయుడు, శివలంక కొండలరావు, రైతు సంఘం జిల్లా నాయకులు జి.గురుబాబు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు, రైతులు

ప్రకృతి వనరులతో భూ సంరక్షణ

ప్రజాశక్తి- చీడికాడ:ప్రకృతిలో లభించిన వనరులను ఉపయోగించుకుని వ్యవసాయం చేస్తే భూమికి సంరక్షణ కలుగుతుందని అదికారులు తెలిపారు. మండలంలోని 23 పంచాయతీల్లో రైతులు ప్రకతి వ్యవసాయమునకు చేరువు కావాలని ఉద్దేశంతో ప్రకతి వ్యవసాయ జిల్లా అధికారి డిపిఎం ఆదేశాల మేరకు గ్రామాల్లో(నేచురల్ ఫార్మింగ్) పకతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, అడిషనల్ డిపిఎం స్వామి నాయుడులు శుక్రవారం మండలంలో జి.కొత్తపల్లి, చిన్న గోగాడ, పెద్ద గోగాడ గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రకృతి వ్యవసాయ విభాగ ఇన్చార్జి సిఆర్పి నాగమణి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న అధికారులు

మోడల్ స్కూల్ సందర్శన

ప్రజాశక్తి-రావికమతం: విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఇఎండిపి కార్యక్రమం ఎంతో దోహద పడుతుందని అధికారులు తెలిపారు. ఈ ప్రోగ్రాం అమలు తీరుపై జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఏ.దిలీప్ మరుపాక మోడల్ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఇఎండిపి జిల్లా రిసోర్స్ పర్సన్ రుత్తల శివరాం మాట్లాడుతూ,ఈ కార్యక్రమం ద్వారా తరగతి గదిలో పిల్లలు క్రియాశీలంగా వ్యవహరిస్తారన్నారు. జిల్లా ప్రోగ్రాం మేనేజర్ దిలీప్ మాట్లాడుతూ, భవిష్యత్తు అవసరాలకు తగినట్టుగా విద్యార్థులకు తర్ఫీదునివ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెసిలిటేటర్ లోవరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళా తపస్వి విశ్వనాథ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-సీతమ్మధార : దర్శకులు కళాతపస్వి కె.విశ్వనాథ్, సాగర్‌ల మరణం సినీ పరిశ్రమకు తీరని లోటని ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (ఎపి మా) గౌరవాధ్యక్షులు దాడి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. బాలేశాస్త్రి లేఔట్‌లో ఏపీమా ప్రధాన కార్యాలయంలో కళాకారులందరు వీరిద్దరి చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లర్పించారు కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు ఎం.కృష్ణ కిషోర్, వై.అప్పారావు, కార్యనిర్వాహకకార్యదర్శులు సిహెచ్. రమేష్ యాదవ్, నాంచారయ్య, పూతి వెంకటరెడ్డి, శివజ్యోతి, టివిఆర్ మూర్తి, నిర్మల్ భాను, చంద్రశేఖర్ పండా, జి కల్యాణ్, విన్నకోట సత్యనారాయణ, డేవిడ్ రాజ్, రవితేజ, జబర్దస్త్ ప్రకాష్, వెంకట్, క్యాలు జనార్ధన్, దర్శకులు యాద్‌కుమార్, గాజువాక బాలు పాల్గొన్నారు.

ఆనందపురం: కళాతపస్వి కె.విశ్వనాథ్ మరణం తెలుగు చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటని టిడిపినేత, వేములవలస ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వరరావు అన్నారు. వేములవలస కూడలిలో విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు రంగస్థల కళాకారుడు, శ్రీ విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి ఉప్పాడ అప్పారావు విశ్వనాథ్ మృతికి సంతాపం తెలిపారు.

అనకాపల్లి : తెలుగు చిత్ర సీమ ఉన్నంతవరకు కళా తపస్వి విశ్వనాథ్ బతికే ఉంటారని ఉత్తరాంధ్ర నాగార్జున ఫ్యాన్స్ అధ్యక్షులు, సినీ అభిమానుల ఐక్యవేదిక అధ్యక్షులు మళ్ల సురేంద్ర అన్నారు. శుక్రవారం జరిగిన విశ్వనాథ్ మృతికి సంతాప సభలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ తెలుగు సినీ చరిత్రలో మరపురాని చిత్రాలను నిర్మించిన విశ్వనాథ్ మృతి సినీ రంగానికి, క్లాసికల్, కమర్షియల్, సంగీత అభిమానులకు తీరని లోటు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ వెంకటేష్ హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకుడు పి చందు, రిటైర్డ్ ప్రిన్సిపల్ బుద్ధ అప్పారావు, ఆడారి రామకృష్ణ, భానుచందర్, మళ్ల సూరిబాబు, పివి జగన్మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో....

స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్ల నాగభూషణం ఆధ్వర్యంలో విశ్వనాథ్ సంతాప సభ నిర్వహించారు. విశ్వనాథ్ గొప్ప దర్శక దిగ్గజమని, 60 చిత్రాలకు దర్శకత్వం వహించడమే కాక పలు చిత్రాల్లో నటించి ఎన్నో అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్నారని కొనియాడారు.

పిఎన్ఎం సంతాపం

కలెక్టరేట్ : ప్రముఖ దర్శకుడు, నటుడు కె.విశ్వనాథ్ మృతి పట్ల ప్రజానాట్య మండలి విశాఖ జిల్లా కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. ఈ మేరకు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చంటి, అధ్యక్షులు జి.రమణ, గౌరవ అధ్యక్షులు దండు నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కె.విశ్వనాథ్ విలువలతో కూడిన సాహిత్యాన్ని సినిమాల ద్వారా ప్రజలకు అందించారని కొనియాడారు. చక్కని సంగీతం, ఇతివృత్తం ఉన్న సినిమాలను నిర్మించారని తెలిపారు. శంకరాభరణం, సాగర సంగమం, స్వాతిముత్యం, స్వయంకృషి వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో మైమరిపించాయని, ఎంతో ఉత్తేజితులను చేశాయని, మానవతా విలువలు చాటాయని పేర్కొన్నారు. ప్రతిష్టాత్మక దాదా పాల్కే అవార్డు పొందిన విశ్వనాథ్ మరణం తెలుగు చలనచిత్ర పరిశ్రమకు తీరనిలోటని తెలిపారు. ఎంతోమంది కళాకారులకు, టెక్నీషియన్లకు, విశ్వనాథ్ ఆదర్శమైన మార్గాన్ని చూపారన్నారు. విశ్వనాథ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నేటి యువ దర్శకులు, రచయితలు ప్రజలకు, సమాజానికి మేలు చేసే సినిమాలు నిర్మించాలని కోరారు.



పర్యటిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

అవినీతికి తావు లేకుండా పథకాలు

- ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

ప్రజాశక్తి-రోలగుంట: ప్రజా రంజక పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని బుచ్చంపేట పంచాయతీ బుర్రంపేట గ్రామంలలో నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. పథకాలు అందకపోతే సచివాలయాన్ని సంప్రదిం చాలన్నారు. ప్రభుత్వం వచ్చిన నాటి నుండి నేటి వరకు ప్రతి కుటుంబానికి వచ్చే సంక్షేమ పథకాలు వివరాలను వివరించారు. అవినీతి రహితంగా లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిత

అంకితభావంతో పని చేయాలి

- మాజీ ఎమ్మెల్యే అనిత

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: టిడిపికి వెన్నుముక కార్యకర్తలు, అభిమానులే అని రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలు, పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని తిమ్మాపురం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు విసిగి పోయారని, ఒక్క అవకాశం ఇచ్చినందుకు రాష్ట్రాన్ని అంధకారంలో ముంచిన ముఖ్యమంత్రిపై ప్రజలు తిరగబడే రోజులు అతి దగ్గరలో ఉన్నాయని ఆమె అన్నారు. ఇటువంటి రాక్షస, నిరంకుశ పాలనను రాష్ట్ర ప్రజలు సహించలేక పోతున్నారని, త్వరలో వైసీపీకి చరమగీతం తప్పదని పేర్కొన్నారు.పార్టీ కార్యకర్తలు మనో నిబ్బరంతో ఉండి, అంకితభావంతో పని చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంఇఒ

క్రీడా సామగ్రి అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ అందించిన క్రీడా సామగ్రిని శుక్రవారం ఎంఈఓ డివిడి ప్రసాద్ ఉపాధ్యాయులకు అందజేశారు. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు, కేజీబీవీ, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలకు ఆట వస్తువులను అందజేసారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిరోజు విద్యార్థులకు వారికి ఇష్టమైన క్రీడల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అనేక క్రీడా సామాగ్రిని సమకూర్చుందన్నారు వ్యాయామ ఉపాధ్యాయులు తప్పనిసరిగా విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని సూచించారు.

రేవుపోలవరం జాతరకు పటిష్ట బందోబస్తు

నర్సీపట్నం డిఎస్‌పి ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని రేవుపోలవరం లో ఈనెల 5న మాఘ పౌర్ణమి జాతర సందర్భంగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన నక్కపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మాఘ పౌర్ణమి సందర్భంగా రేవుపోలవరం సముద్ర తీరంలో ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లాలో పలు సర్కిల్ నుంచి పోలీస్ బందోబస్తును జాతరకు నియమిస్తున్నామన్నారు. ఈనెల 4వ తేదీ రాత్రి నుంచి 6వ తేదీ ఉదయం వరకూ అడ్డరోడ్డు, రేవుపోలవరంలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేస్తున్నామని, అడ్డరోడ్డు నుంచి రేవుపోలవడం వరకూ చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ముఖ్యంగా రేవుపోలవరం తీరానికి సముద్ర స్నానానికి వచ్చినప్పుడు పిల్లలు, ఆభరణాలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. తీరం వెంబడి మెరైన్ పోలీసులతో పాటు గజ ఈతగాళ్లను కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. ఆయన వెంట ఎస్ఐ శిరీష్ ఉన్నారు.



ప్రత్యేక బస్సుల ఏర్పాటు : డిపో మేనేజర్

నర్సీపట్నంటౌన్: మాఘ పౌర్ణమి సందర్భం గా రేవు పోలవరంకు 35 ప్రత్యేక బస్సులు నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ ధీరజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 4 శనివారం సాయంత్రం నుండి 5వ తేదీ సాయంత్రం వరకు నర్సీపట్నం ఆర్టీసీ డిపో నుండి రేవు పోలవరంనకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. నర్సీపట్నం నుంచి రేవు పోలవరంనకు 10 బస్సులు, కొడవలిపూడి వెంకటాపురం - రేవు పోలవరంనకు 2, క్రివానిపాలెం - రేవు పోలవరంనకు 3, యలమంచిలి - రేవు పోలవరంనకు 2, అడ్డురోడ్డు - రేవు పోలవరంనకు 18 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్నిభక్తులు వినియోగించు కోవాలని ఆయన కోరారు.

జాతర ఏర్పాట్లును ఎఎస్‌పి పరిశీలన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలోని తీర ప్రాంతమైన రేవుపోలవరం గ్రామంలో ఈనెల 5న మాఘ పౌర్ణమి జాతరకు చేస్తున్న ఏర్పాట్లను నర్సీపట్నం ఏఎస్పీ కె.ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ జాం కాకుండా తీసుకుంటున్న చర్యలను స్థానిక సీఐ నారాయణరావును అడిగి తెలుసుకున్నారు. సముద్ర తీరం వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేసారు. ఆయన వెంట ఎస్ఐ ప్రసాదరావు, గ్రామ సర్పంచ్ లోవరాజు, గ్రామ కార్యదర్శి లక్ష్మణరావు, చేపల రాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎఎస్‌పి ప్రవీణ్‌కుమార్

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో చేపడుతున్న జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ సూచించారు. శుక్రవారం గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న పనులపై ఆరా తీశారు. నిర్మాణదారులకు బిల్లులు సకాలంలో చెల్లించడంతో పాటు సామాగ్రిని అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఇంజనీరు జగదీశ్వర్‌రావు, సచివాలయ ఇంజనీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఉదయశ్రీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా అడవిరాజులబాబు పండగ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురం గ్రామంలో శుక్రవారం అడవి రాజులబాబు పండుగను భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పండుగ సందర్భంగా పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-యస్.రాయవరం: మండలంలోని సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కే.హేమంత్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, యాప్‌ల నిర్వహణపై ఆరా తీశారని వైద్యులు ఎస్.ఎస్.వి.శక్తి ప్రియ, వాసంతి తెలిపారు.నూతనంగా నిర్మిస్తున్న పి.హెచ్.సి భవనాన్ని పరిశీలించి మెడికల్ ఆఫీసర్లకు, కాంట్రాక్టరుకు సూచనలు, సలహాలు అందించినట్లు ఆరోగ్య విస్తరణ అధికారులు టి.నాగేశ్వరరావు, బి.సత్యనారాయణ తెలిపారు. ఫ్రై డే..డ్రై డే సందర్భంగా గ్రామంలో పర్యటించారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ